నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పిం చవచ్చునని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

కొందరికే తల్లికి వందనం

- పథకం అమలులో వింత నిబంధనలు
- రకరకాల కారణాలతో అనర్హత వేటు
- కరెంట్ బిల్లులు, భూములు, వాహనాల పేర్లతో నిలివేత
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- స్కీమ్ వర్కర్లకు, మున్సిపల్ కార్మికుల పిల్లలకూ వర్తించని పథకం

ప్రజాశక్తి - చాపాడు

1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే పిల్లలకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఈనెల 12 నుంచి అమలు చేస్తోంది. ఇంట్లో ఎంత మంది పిల్లలుచదువుకుంటే అందరికీ ఒకొక్కరికి రూ. 13 వేల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. పథకం ప్రారంభానికి ముందే ప్రభుత్వం అర్హుల, అనర్హుల జాబితాను ప్రకటించింది. ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు వివరాల కారణంగా పలువురు ఈ పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్టు, రెండు, మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు, అధిక యూనిట్లు వాడినట్టు, ఫోర్ వీలర్ ఉన్నట్టు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని పలువురికి పథకాన్ని నిలిపివేశారు. వీరే కాకుండా అంగన్వాడీలు, స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం నిలిపి వేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వీటిని సరిదిద్దుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో పాఠశాలల విద్యార్థులు 3 లక్షలు వరకు ఉన్నారు. వీరిలో సుమారు 50వేల మంది వివిధ కారణాలతో పథకానికి దూరం అయ్యారు. జిల్లాలో సుమారు 10వేల మంది అర్హులుగా ఉన్నప్పటికీ వివిధ కారణాలు చూపి వారిని తల్లికి వందనం పథకానికి దూరం చేశారు. జిల్లాలో ఎంతమంది విద్యార్థులకు పథకాన్ని వర్తింపజేశారో విద్యాశాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఆన్ లైన్ తప్పిదాల వల్ల చాలా మంది అర్హులకు ఈ ఏడాది తల్లికి వందనం వర్తించలేదు. తప్పులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పటికీ వారంతా సచివాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరుగుతున్నారు. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగించారనే సాకుతో అనర్హులని డబ్బులు వెయ్యకపోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ వినియోగం 100 నుండి 250 లోపు యూనిట్లు ఉన్న వారికి కూడా డబ్బులు జమ కాకపోవడంతో అధికారుల తీరుపై మండి పడుతున్నారు. గతంలో భూమి లేక పోయిన భూమి ఉన్నట్టు తప్పులు పడడంతో వారంతా అనర్హుల జాబితాలో చేరారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లకు తల్లికి వందనం తోపాటు పలు సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. చాలీచాలని జీతాలకు పనిచేస్తున్న చిరుద్యోగులకు సంక్షేమ పథకాల్లో కోత విధించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. బ్యాంకులలో ఆధార్ అనుసంధానంతో ఎన్‌పిఐసి లేని కారణంగా చాలామందికి డబ్బులు పెండింగ్‌లో పడ్డాయి బ్యాంకు అధికారులు ఎన్‌పిఐసి వేసేందుకు అయిష్టం చూపుతుండడంతో ప్రస్తుతం పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. ముందస్తుగా అర్హుల జాబితాను విడుదల చేసి ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తేవి కాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. సచివాలయ కేంద్రాల ద్వారా సమస్యలు ఉన్నవారి వివరాలను తిరిగి సేకరించారు. జులై 5న నగదు వేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసినదే. తిరిగి ఎంతమందికి తల్లికి వందనం పథకం వర్తిస్తుందో వేచి చూడాలి.

300 యూనిట్లు దాటిందని..

మా కుమారుడు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకొని రెండవ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. తల్లికి వందనం పథకం అమలు కాలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే 300 యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వాడుకుంటున్నారని కారణం తెలిపారు. ప్రతినెల 120 యూనిట్ల లోపు మాత్రమే కరెంటు బిల్లు వస్తుంది. కానీ తప్పుడుగా సమాచారం నమోదు చేశారు. ప్రస్తుతం ట్రాన్స్ కో కార్యాలయంలో ప్రతి నెలా వస్తున్న బిల్లుల వివరాలను సేకరించి సచివాలయంలో అందజేశాం. **-రాజేశ్వరి, రెవెన్యూ కాలనీ, మైదుకూరు.**

అర్హత ఉన్నా నగదు జమ కాలేదు..

తల్లికి వందనం పథకానికి సంబంధించి అధికారులు విడుదల చేసిన అర్హత కలిగిన లిస్టులో మా పిల్లల పేర్లు ఉన్నప్పటికీ నగదు జమకాలేదు. బ్యాంకులో ఎం పిఐసి కూడా వేశారు. నగదు మాత్రం ఇప్పటికి జమ కాలేదు. సచివాలయానికి వెళితే ఎలిజిబుల్ లిస్టులో పేరు ఉండడంతో నగదు పడుతుందని చెబుతున్నారు. నగదు ఎందుకు జమ కాలేదో ఎవరూ చెప్పడం లేదు.

-జ్యోతి, విద్యార్థి తల్లి, చాపాడు

మెరుగైన సేవలకు చిరునామాగా నిలుపుతాం

- త్వరలో మరిన్ని ఆధునిక పరికరాలు ఏర్పాటు
- జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సి.సునీల్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని మెరుగైన సేవలకు చిరునామాగా నిలుపుతాం. త్వరలో మరిన్ని ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అరుదైన వైద్యసేవలకు నిలయంగా మారుస్తాం. దీంతోపాటు వైద్యప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సమర్థ విధానాలను అమలు చేయడంపై దృష్టి సారిస్తాం. 2024 డిసెంబర్‌లో సూపర్‌స్పెషాలిటీ విభాగం అందు బాటులోకి వచ్చినప్పటి నుంచి అంచెలంచెలుగా ఆధునిక చికిత్సలు అందించుకుంటూ వస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రోగులకు మెరుగైన చికిత్సల విషయంలో రాష్ట్రప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలను పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొంటున్న జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్, సి.సునీల్‌కుమార్‌రెడ్డి తో ముఖాముఖి...

ముఖాముఖి..

సూపర్ సేవలను వివరించండి?

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి విభాగంలో క్లిష్టమైన శస్త్రచికిత్సలకు చిరునామాగా మారింది. మెడికల్ కేటగిరీలో కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఎండోక్రైనాలజీ విభాగాలలో ఔట్‌పేషంట్, ఇన్‌పేషంట్ సేవలు అందిస్తున్నాం. వీటితోపాటు కార్డియాలజీలో క్యాత్‌ల్యాబ్, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, న్యూరాలజీలో ఇఇజి, గ్యాస్ట్రోలో ఎండోస్కోపీ, నెఫ్రాలజీలో డయాల సిస్, ఎండోక్రైనాలజీ విభాగంలో థైరాయిడ్, షుగర్ వ్యాధులకు వైద్య సేవలను అందిస్తున్నాం.

ఒపి, ఐపి వివరాలు తెలపండి?

రోజూ 250 ఒపి, 45 మంది ఐపి రోగులకు చికిత్స అందిస్తున్నాం.

సూపర్‌సేవల పట్ల అవగాహన క్రమేణా పెరుగుతున్న నేపథ్యంలో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈలెక్కన ఆనతి కాలంలోనే స్పెషలిస్టు సేవలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

సర్జికల్ వైద్యసేవల గురించి చెప్పండి?

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నియోనేటల్ అండ్ పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్‌సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూరోసర్జరీ, కార్డో థొరాసిక్ సర్జరీ, అనస్థీషియా విభాగాలున్నాయి. ఇందులో కార్డో థొరాకిసక్ సర్జరీ వైద్య నిపుణులు కొరతను అధిగమించాల్సి ఉంది.

ఆధునిక పరికరాల ఏర్పాటు గురించి చెప్పండి?

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.10.30 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయడమైంది. ఇటీవల రూ.2.28 కోట్ల విలువ కలిగిన 3డి అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ మిషనరీని సైతం ఏర్పాటు చేయడమైంది. దీంతోపాటు డయాగ్నోస్టిక్ విభాగంలో 5 పార్ట్ సెల్, కౌంటర్ ద్వారా సిబిపి టెక్ట్స్, సెమీఆటోనలైజర్, బయో కెమిస్ట్రీ ఇన్‌వెస్టిగేషన్ పరికరాలను ఏర్పాటు చేయడమైంది. వీటితో పాటు మరో రూ.48 కోట్లు విలువ చేసే ల్యాప్రోస్కోపిక్ పరికరం ఏర్పాటు చేయాలని కోరుతూ సంబంధిత ప్రతిపాదనలు చేయడమైంది.

నర్సింగ్‌సేవల కొరతపై మీరేమంటారు?

నర్సింగ్ సేవల కొరత ఉన్న మాట వాస్తవమే. హెడ్ నర్స్‌లు 20 మంది ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. మరో 15 మంది రీసెంట్ రిక్రూట్‌మెంట్‌లో రావాల్సి ఉంది. 140 స్టాఫ్‌నర్స్, గ్రేడ్-1, గ్రేడ్-2 ఫార్మసిస్ట్‌లు, 02 రేడియోగ్రఫీ నిపుణుల అవసరం ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ పర్యవేక్షణలో 69 పోస్టులు రిక్రూట్‌మెంట్ జరుగుతోంది. వీరంద రూ అందుబాటులోకి వస్తే నర్సింగ్‌సేవల లభ్యత గణనీయంగా పెరు గుతుంది.

మెరుగైన సేవల పరిస్థితి ఏమిటి?

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఒపిడి, ఐపి, ఐవిఆర్‌ఎస్ సేవలను మానిటరింగ్ చేస్తాం. వీటితోపాటు మందుల లభ్యత, శానిటేషన్, లంచం వసూలు వంటి అంశాలపై రోగులతో ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం జరుగుతోంది. ఇటీవలే బదిలీపై వచ్చిన సిఎస్ఆర్ఎంతో కలిసి ర్యాండమ్‌గా పరిశీలనలు చేయడం జరుగుతోంది.

సామాజిక స్పృహ గల రచయిత సత్తార్‌ఫైజీ

ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సత్తార్ ఫైజీ నేటి సమాజానికి అనుగుణంగా సామాజిక స్పృహ గల అంశాలనే తీసుకుని రచనలు చేస్తున్నారని, ప్రస్తుతం ఉర్దూ భాష పరిరక్షణకు,ఉర్దూ భాష అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న 36 మంది ఉర్దూ కవుల జీవిత విశేషాలను సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 'ఉర్దూ హృదయం లో తెలుగు స్వరం' అనే విశిష్ట గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం రాయలసీమ ఉర్దూ రచయితల సమైక్య ఆధ్వర్యంలో కడప నగరం సెవెన్ రోడ్స్ ద్వారకా టవర్స్ అకాడమీ కాన్ఫరెన్స్ హాల్లో సత్తార్ ఫైజీ రచించిన ఉర్దూ హృదయంలో తెలుగు స్వరం అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కవిగా,రచయితగా, అనువాదకునిగా పరిశోధకునిగా, నటునిగా బహుముఖ ప్రజ్ఞను కనపరుస్తున్న సత్తార్ ఫైజీ ఈ గ్రంథంలో ఉర్దూ భాష ఔన్నత్యానికి, అభివృద్ధికి, పరిరక్షణకు కృషి చేస్తున్న విశ్వవిద్యాలయ ఆచార్యులు, కవులు, కళాకారులు, రచయితలు, విద్యావేత్తలు, భాషావేత్తలు, పరిశోధకులు మొదలైన వారి జీవిత విశేషాలను, వారి రచనలను పరిశోధనా దృక్పథంతో రాశారన్నారు. అధ్యక్షులుగా వ్యవహరించిన ఆచార్య ఖాసిం అలీ ఖాన్ మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గతంలో పిల్లల ప్రపంచం,ఉర్దూ సాహిత్య నవరత్నాలు, భక్తి - ముక్తి అనే గ్రంథాలు రాశారని జిల్లాలో కవిగా రచయితగా ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ సలీం బాష సత్తార్ ఫైజీ ఉర్దూ భాషకు చేస్తున్న సేవ గురించి కవిత రూపంలో గానం చేశారు.

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన అమీర్ బాబు మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గత 30 ఏళ్లుగా ఎన్నో ఉర్దూ కవి సమ్మేళనాలు, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయునిగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. గౌరవ అతిథులు రఘునాథరెడ్డి, నాసర్ బాష, రజాక్ సాబ్, ఇఫ్తె ఖార్ జమాల్, ఉర్దూ కవులు సయీద్ ఖాన్, మహమూద్ షాహిద్, అన్వర్ హాది, సర్దార్ సాహిర్, మహబూబ్ ఖాన్, ఉపాధ్యాయులు డాక్టర్ వసీవుల్లా భక్తి యారి, డాక్టర్ ఖాజా పీర్, గునిశెట్టి శ్రీనివాసులు, అబ్దుల్ ఖాదర్ ఖాన్ లాజక్, అహమ్మద్, అతావుల్లా అక్తర్, గౌస్ ఖాన్, ఆరిఫ్ మొదలైన వారు సత్తార్ ఫైజీ ప్రతిభా విశేషాలను కొనియాడారు. రచయిత సత్తార్ ఫైజీ ని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం వారు, ఆయన అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్తార్ ఫైజీ స్నేహితులు, బంధువులు, ఉర్దూ భాషా ప్రేమికులు పాల్గొన్నారు.

దూదేకుల కార్పొరేషన్ హామీ అమలు చేయాలి

- వెనుకబడిన విద్యార్థుల సంక్షేమానికి పాటుపడతాం
- దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్ధయ్య

ప్రజాశక్తి - కడప సిటీ

బిసి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా దూదేకుల కార్పొరేషన్ కింద రూ.100 కోట్లు ఇస్తామనే హామీని కూటమి సర్కారు అమలు చేయాలని దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్ధయ్య పేర్కొన్నారు. ఆదివారం కడప పట్టణం శంకరాపురంలోని మస్తాన్ కోచింగ్ సెంటర్‌లో దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ దూదేకుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధ్యాయ, పోలీస్, రెవెన్యూ రంగాల్లో అవసరమైన సహాయం చేస్తామని తెలిపారు. దీంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన దూదేకుల పిల్లలను దత్తత తీసుకోవాలన్నారు. ఇప్పటికే చాలామంది తెలివైన దూదేకుల పిల్లలు ఆర్థిక స్తోమత లేని కార ణంగా ఉన్నతస్థానాలకు చేరుకోలేకపోవడం బాధాకరమని తెలిపారు. అనంతరం దూదేకుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సుంకేసుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో బిసి డిక్లరేషన్‌లో భాగంగా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, రూ.100 కోట్లు నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిల బెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీ ముస్లిములకు వర్తించే రుణాలన్నీ దూదేకులకు వర్తింపజేయాలన్నారు. దూదేకుల ముస్లిమ్, నూర్‌బాషా ముస్లిమ్‌గా పేర్కొంటూ జీవో తెస్తామన్న హామీ, జనగణనలో నూర్‌బాషాలను, ముస్లిములను వేర్వేరుగా గుర్తింపు, మైనార్టీ హోదాగా ఉన్న సర్క్యులర్ జీవోగా మార్పు, కోర్టులో ఉన్న ఓబిసి 4.5 శాతం రిజర్వేషన్ అమలు ప్రక్రియ వేగవంతం, ఇస్లామిక్ బ్యా ంక్ ఏర్పాటు ద్వారా రుణాల మంజూరు వంటి హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ జిల్లా అధ్యక్షులుగా ఫయాజ్‌బాషా, పీరయ్యతో సహ బాషా, మస్తాన్ సహ పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్ సుభాన్, మహ్మద్, పీరయ్యతోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడతున్న దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న ఎస్‌పి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను ఆదివారం తన కార్యాలయంలో మీడియాకు వివరించారు. 15 రోజుల్లో 13 మట్కా కేసుల్లో మొత్తం 43 మంది అరెస్టు చేసి రూ. 2, 11,930 నగదు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. జూదమాడుతున్న మొత్తం 106 మందిని అరెస్టు చేసి రూ.1,82,650 నగదు స్వాధీనం చేసుకుని 19 కేసులు నమోదు చేశారని తెలిపారు. జిల్లాలో రెండు క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న 8 మందిని అరెస్టు చేసి రూ. 76,000 నగదు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ముమ్మర దాడులు నిర్వహించి 235 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 52 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. 3 కోడి పందేల కేసుల్లో మొత్తం 21 మందిని అరెస్టు చేసి రూ. 81,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 3.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియచేయాలని సూచించారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కడప

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. కృష్ణమూర్తి, కత్తెర్ల చంద్రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. కడప నగరంలోని స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్ వద్దనున్న రజక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రజక ప్రతినిధుల సమావేశంలో రజక నాయకులు మాట్లాడారు ఈసందర్భంగా ముఖ్యమంత్రి రజకులకు ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. దేశంలోని 17 రాష్ట్రాలలో రజకులు, దోబీలుగా పిలవబడుతూ ఎస్‌సి జాబితాలో చేర్చడం వల్ల ఆయా రాష్ట్రాలలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగాను అభివృద్ధి చెందారన్నారు. మన తెలుగు రాష్ట్రాలలో మాత్రం అన్ని విధాలుగా వెనుక బడి ఉన్నారని చెప్పారు. ఇప్పటికే చాలా వరకు అన్నివిధాలా నష్టపోయిన రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.. 50 ఏళ్ల వయసు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్లు మంజూరు చేయాల అన్నారు. లాండ్రీ షాపులకు సబ్సిడీ కరెంటు విధానం అమలు చేయాలన్నారు. .కడప జిల్లాలో కొత్త ధోబీఘాట్లకు నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కడప జిల్లాలో దోబీఘాట్ల స్థలాలు కబ్జాలకు గురికాకుండా ప్రత్యేక జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో వృత్తి పైన ఆధార పడి జీవిస్తున్న రజక వృత్తి దారులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.పిచ్చయ్య, సి. చెన్నప్ప, బండ యరికలయ్య, గోవిందాయపల్లి, కృష్ణయ్య,హెచ్. ఆంజనేయులు, కె. భాస్కర్, చింతకుంట శ్రీనివాసులు, సి. రాజా, బి. గంగులయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ: చేలో చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షులు భజన సుబ్బరాయుడు, ఎస్.పి. రామయ్య, ఎం. దుర్గప్ప కార్యదర్శులు పాల్గొన్నారు.

తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

భారీ స్కోరు సాధించిన కడప జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిఏ సౌత్ జోన్ అండర్ - 19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.2 ఓవర్లలో 399 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఏ. నాగ కుల్లాయప్ప బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 182 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు సహాయంతో 101 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. ఏ. సాయి ఆర్దిత్ రెడ్డి 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4, ధనుష్ రెడ్డి 2, తేజేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 362 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 86, కారుణ్య ప్రసాద్ 78, చైతన్య తేజ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని రేవంత్ వికెట్లు తీసుకున్నాడు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన అండర్ -14, అండర్ -16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. అండర్-14 జిల్లా జట్టు ఎంపికలకు 300 మందికి పైగా హాజరయ్యారు. ఆర్డర్ -16 జట్టు ఎంపికలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ '14 అండర్ -16 జిల్లా జట్ల ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచిన వారిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసి మ్యాచ్లు నిర్వహించిన అనంతరం అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు.

విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి డొనేషన్ల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, సిబిఎస్ఇ, వసతి గృహాలు, ప్లే స్కూల్స్ వంటి వాటికి అనుమతులు లేకపోయినా విద్యాసంస్థలు కొనసాగిస్తున్నారని, ఇవన్నీ విద్యాశాఖాధికారులు తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగని పిడిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. అంకన్న పేర్కొన్నారు. నగరంలోని పిడిఎస్‌యు ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రయివేట పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖధికారులైన ఆర్‌జెడి, డిఇఒ, డిప్యూటీ డిఇఒలు వత్తాసు పలుకుతున్నారని, తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలోని ఉమ్మడి కలెక్టర్లు జోక్యం చేసుకోవాలని చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలో కడప నగరం, ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందుల, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్నా విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించి, సిబిఎస్ఇ అనుమతి లేకపోయినా, ఉన్నట్లు చెబుతూ ప్లే పాఠశాలలు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. వసతి గృహాలు అనుమతి లేకపోయినప్పటికీ సొంతంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నారన్నారు. కనీసం విద్యాశాఖ అధికారుల కూత వేట దూరంలో ఉన్న పాఠశాలలు తనిఖీ చేసే దానికి కూడా సమయం లేదని పేర్కొన్నారు. దోపిడి అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా పిడిఎస్ యు నాయకులు మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కబ్జాదారుల చేతుల నుంచి వక్ఫ్ ఆస్తులను రక్షించాలని ఎపికాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్ డిమాండ్ చేశారు. ఆదివారం వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై చర్చా వేదిక కార్యక్రమం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ వక్ఫ్ అంటే దైవార్పితమైన ఆస్తి అన్నారు. రాజులు, నవాబులు, భక్తులు ముస్లిం సమాజం కోసం సమర్పించిన ఆస్తి అని తెలిపారు. బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డిఎ కూటమిలోని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్లోనూ, రాజ్యసభలోను ముస్లిములకు నష్టం చేసే 'వక్ఫ్'చట్టానికి అనుకూలంగా ఓటు వేసిందని విమర్శించారు. పైగా రాష్ట్రంలో ముస్లిములకు అన్యాయం జరగనివ్వమంటూనే చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రస్తుతానికి సుప్రీంకోర్టులో ఉన్నా అంతిమ నిర్ణయం మాత్రం పార్లమెంటుదే అన్నారు. కడపలో పేద ముస్లిములకు ఉపయోగపడే వేలకోట్ల రూపాయలు వక్ఫ్ ఆస్తులు కొంతమంది ముస్లింలు, ముస్లిమేతరులు ఆక్రమించి అనుభవిస్తున్నారని తెలిపారు.

పుస్తక పఠనం మంచి వ్యాపకం కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పుస్తక పఠనం ప్రతి ఒక్కరికీ మంచి వ్యాపకం కావాలని సిపి బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు జానమద్ది విజయ భాస్కర్ కోరారు. ఆదివారం కడప ఆఫీసర్స్ క్లబ్‌లో నూతనంగా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరిక వేళల్లో క్లబ్బుకు వచ్చి విలువైన పుస్తకాలను చదవాలని పేర్కొన్నారు. గ్రంథాలయ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుస్తకాలను భద్రపరిచేందుకు అవసరమైన అద్దాల బీరువాను పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేసిన కేశవులు బహుకరించాలని చెప్పారు. ఇప్పటివరకు క్లబ్బులో గ్రంథాలయం లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ హెడ్మాస్టర్ కల్లూరు ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖలో పని చేస్తున్న నరసింహులు మరికొన్ని పుస్తకాల కొనుగోలుకు తమ వంతుగా రూ.10వేలు అందజేశారని తెలిపారు.

కాలువలో పూడికతీత

ప్రజాశక్తి - కడప అర్బన్



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకుడు కొండా సుబ్బయ్య

కడప నగరంలోని 15వ డివిజన్ నిరంజన్ నగర్, ఫరీదానగర్ దస్తగిరి కొట్టాలలో ఉన్న మురుగు కాలవలో పూడికను డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి కొండా సుబ్బయ్య తీయించారు. ఆదివారం కాలనీలలో నిర్వహించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల అభ్యర్థన మేరకు పెద్ద డ్రైనేజీ కాలువలో పూడిక పేరకపోవడం వల్ల నీరు సరిగా పోక దోమలు ఎక్కువై పిల్లలు, వృద్ధులు జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశామని చెప్పారు. వెంటనే జెసిబితో ట్రాక్టర్ ను పంపించి పూడిక తీయించారని పేర్కొన్నారు.. అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్షణ గోడలేని కెసి ఉపకాలువ కల్వర్టు

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు వద్ద కాశీనాయన ఆలయ సమీపంలో కడపకు వెళ్లే ప్రధాన దారిపై కెసి కెనాల్ ఉప కాలువకు సంబంధించి నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు కరువయ్యాయి. వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ మార్గం ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలు నిత్యం అధికంగా ఉంటుంటాయి. కెసి కెనాల్‌లో నీటి ప్రవాహం ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. సమీప ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాలకు సైకిళ్లపై ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై నడిచే పాదాచారులు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నీటి వాటాల గురించి వివరిస్తున్న పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

కృష్ణానది బోర్డును ఎపికి తరలించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదారాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో సెక్షన్ 85, సబ్ సెక్షన్ 1 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల్లోపు కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని, కానీ 11ఏళ్లు అయినా తెలంగాణ రాష్ట్రం హైదరా బాద్‌లో ఉండడం శోచనీయమన్నారు. ఈ కార్యాలయాన్ని ఎపిలోని శ్రీశైలం, కర్నూలులోగాని ఏర్పాటు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డుపై 27వ తేదీన జరిగే సమావేశంలో ఒత్తిడి చేయాలని సూచించారు. ఎగువ ఉన్న తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 90 టిఎంసిలు ఎత్తిపోసే విధంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 30 టిఎంసిలు ఎత్తిపోసే విధంగా డిండి ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర జల సంఘం, కృష్ణానది యాజమాన్య బోర్డు అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే దిగువ ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్, వెలిగొండ, హంద్రీ నీవా, తెలుగుగంగ, గాలేరు - నగరి ప్రాజెక్టులకు నీరు అందక 48 లక్షల ఎకరాల సాగు భూమి బీడుగా మారుతుందని పేర్కొన్నారు. తాగునీటికి కటకట ఏర్పడుతుందని పేర్కొ న్నారు. పరిశ్రమలకు నీరు అందదని వివరించారు. తెలంగాణ అక్రమ ప్రాజె క్టులను అడ్డుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా కృషి చేయాలని తులసిరెడ్డి కోరారు.

నేటి 'యువతపోరు'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఖాజీపేట



పివి రాఘవరెడ్డి

కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను అన్యాయానికి గురి చేసిందని, వారికిచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసనగా సోమవారం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా జనరల్ సెక్రటరి పివి రాఘవరెడ్డి పిలుపు నిచ్చారు. ఆ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పి ఏడాది అవుతున్న ఇంత వరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటి స్తామని, దాన్ని కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భారీ ర్యాలీతో కలెక్టర్‌కు వినతి పత్రమివ్వనున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు కోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని రైతులు పచ్చిరొట్ట విత్తనాలు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి తెలిపారు. మండలానికి 100 క్వింటాలు జీలగలు కేటాయించారన్నారు. జీలగలు పూర్తి ధర రూ.1,230(10కిలోలు) రాయితీ ధర రూ.615 (10కేజీ)రైతు వాటా రూ.615 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సోమ వారం నుండి రైతు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సోమవారం ఎస్.మైదుకూరు రెవెన్యూ గ్రామాల రైతులు నమోదు ప్రక్రియకు రావాలని ఆయన సూచించారు. అన్నలూరు, శివపురం రైతులు వారి రైతు సేవ కేంద్రంలో నమోదు చేయించు కోవాలని తెలిపారు. రైతులు వచ్చేటప్పుడు పట్టాదారు పాస్ బుక్,1-బి జిరాక్స్, సెల్‌ఫోన్ నెంబర్ తీసుకొని రావాలని సూచించారు. **దువ్వూరు :** మొదటి విడతలో భాగంగా సోమవారం నుంచి రైతులకు రాయితీతో జీలుగలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని చింతకుంట-1, చింతకుంట-2, అన్నపుశాస్త్రపల్లి, ఎం.ఎర్రబెల్లి గ్రామాల పరిధిలో ఉన్న మాచనపల్లి, గోపులాపురం, బల్లకివారిపల్లి గ్రామాలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వరి సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కిలో జీలుగలు రూ.123కాగా, రాయితీపోనూ రూ.61.50కు ఇస్తామ న్నారు. వరిసాగు చేసే రైతులు మాత్రమే జీలుగలు తీసుకోవాలన్నారు. దుర్విని యోగం చేస్తే భవిష్యత్‌లో ఇతర పథకాలకు అనర్హులవుతారని ఆయన సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాఠశాల అభివృద్ధికి పారిశ్రామిక వేత్త రాజగోపాల్‌రెడ్డి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - లింగాల

తాము చదివిన పాఠశాలలో అప్పటి జ్ఞాపకాలు, బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ పెద్దకుడాల జిల్లా పరిషత్ హైస్కూలు 1984-85 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజగోపాలరెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వంకల్లో పూడిక తీసేదెన్నడో..!

పూడికతో నిండిన వంకలతో వర్షాకాలం తప్పని తిప్పలు

కడప రోడ్డులో వంకలో పెరిగిన కంపచెట్లు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వంకల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వంకలో కంప చెట్లు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. వంకల పునరుద్ధరణ గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. అధిక వర్షాలు వచ్చినప్పుడు నీరు ప్రవహించే ఏర్పాట్లు లేక లోతట్టు ప్రాంతాల్లో నీరు వచ్చే చేరుతోంది. ఈ పరిస్థితుల్లో కొన్ని కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా వనిపెంట రోడ్డు పేదల కాలనీవాసులు మునిసిపాలిటీ అధికారులకు తమ సమస్య గురించి విన్నవించుకుంటున్నారు. వంకలలో పూడికతీత పనులు చేప ట్టాల్సిన అవసరం ఉంది. చాలాచోట్ల వంకలు, కాలువలు ఆక్రమణకు గుర య్యాయి. నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా ఇళ్ల మధ్యకు వర్షపు నీరు వచ్చే పరిస్థితి. చెరువు నుండి వచ్చే అలుగు నీరు ప్రవహించేందుకు బద్వేల్ రోడ్డు నుండి కడప రోడ్డుకు కాలువ ఏర్పాటు చేశారు. ఈ కాలువ పూర్తిగా ఆక్రమణలతో, పూడికతో నిండి ఉండటం వల్ల నీరు పోయే అవ కాశం లేదు. వర్షాకాలం నీరు పూర్తిగా రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి ఏర్పడు తోంది. కడప రోడ్డులోని తెగిపోయిన గండి వంక పరిస్థితి కూడా అంతే. సర్వాయపల్లి రోడ్డులోని వంకల చుట్టూ పెద్దపెద్ద కంపచెట్లు మెలిచి వంక పూర్తిగా నిండిపోయింది. బద్వేల్ రోడ్డులో సుందరయ్య కాలనీ పైభాగాన ఉన్న వంక కూడా ఆక్రమణకు గురైయింది. ఉప్పు వాగులో ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు అధికారులకు కాలనీ ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లను కలిసి పూడికతీత చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని కోరిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వంకలలో పూడికతీత చేపట్టి ఆక్రమ ణలు తొలగిస్తే వర్షాకాలం లోతట్టు ప్రాంతాలు నీట మునకకు గురి కావని ప్రజలు కోరుతున్నారు.

'సూర్యఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పులివెందులరూరల్

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రతి విద్యుత్ వినియోగదారుడూ వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డిఇ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో ఆదివారం ప్రజాకళా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఇ మాట్లాడుతూ రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లును కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనకు దరఖాస్తు చేసుకోవాలంటే సుమారు రూ.2లక్షలు ఖర్చు అవుతుందని, ఇందులో రూ.78,000 ప్రభుత్వ రాయితీ ఇస్తుందన్నారు. బీసీలకు రూ.20వేలు రాయితీ అందుతుందన్నారు. మిగతావారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు అందిస్తాయని తెలిపారు. ఉచిత సూర్యకాంతిని సద్వినియోగం చేసుకోని విద్యుత్తు బిల్లును కూడా తగ్గించుకోవచ్చని సూచించారు. రూఫ్ ఆఫ్ టాప్ సోలార్ పవర్ టెక్నికల్ నెట్ మీటరింగ్ సిస్టం ద్వారా కరెంట్ బిల్లు సుమారు 90 శాతం తగ్గించుకోవచ్చని, సోలార్ ఉపయోగించడం వలన బొగ్గు ఆధారిత విద్యుత్తు తగ్గుతుందని తెలిపారు. తద్వారా సహజ వనరులను భావితరాలకు పొదుపు చేసిన వాళ్లమవుతామన్నారు. వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. సౌరశక్తి నిరంతరం ఉత్పత్తి అయ్యే శక్తి.. నిర్వహణ ఖర్చు చాలా

మాట్లాడుతున్న డిఇ ప్రసాద్‌రెడ్డి

తక్కువ అవుతుందన్నారు. ప్రారంభంలో పెట్టుబడి మాత్రం ఉంటుందని తెలిపారు. సోలార్ అన్‌గ్రేడ్ నెట్ ద్వారా వ్యాపార రీత్యా ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి రాయితీ లేదని, మీ పెట్టుబడిని 40 సంవత్సరాల లోపు తిరిగి పొందవచ్చని సోలార్ అన్‌గ్రిడ్ సిస్టం ద్వారా మనం ఉపయోగించగా మిగిలిన విద్యుత్తును ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు సోలార్ ప్యానల్స్ ఉపయోగపడుతుందని వివరించారు. దీని జీవితకాలం సుమారు 25 ఏళ్లు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు ప్రకటించనున్న అర్హుల జాబితా..!

30 నుంచి ట్రిపుల్‌ఐటిలో కౌన్సెలింగ్-జులై 14 నుంచి తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిల్లో అడ్మిషన్లు ఇచ్చేందుకు ఎంపికైన అర్హుల జాబితా ఈ నెల 23న విడుదల కానుంది. అడ్మిషన్లుకు సంబంధించి ఈ నెల 30, జులై 1న ఇడుపులపాయకి ఎంపికైన విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో కౌన్సెలింగ్ ఉంటుంది. అదేరోజు నూజివీడుకు ఎంపికైన వారికి కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జులై 2, 3 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులకు నూజివీడులో, జులై 4,5 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్‌ఐటిలో కౌన్సెలింగ్ ఉంటుంది. ఒంగోలు ట్రిపుల్‌ఐటికి భవనాలు లేకపోవడంతో పీయూసీ రెండేళ్ల కోర్సును ఇడుపులపాయలో, బిటెక్ నాలుగేళ్ల కోర్సును ఒంగోలులోని అద్దె భవనాల్లో నిర్వహిస్తారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత విద్యార్థులు జూలై 14న ఆయా క్యాంపస్‌ల్లోకి చేరుకోవాల్సి ఉంటుంది. అదేరోజే తరగతులు ప్రారంభమవుతాయి. నాలుగు ట్రిపుల్‌ఐటిలకు ఎంపికైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో 10 రకాల ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. పదవ తరగతి మార్కుల జాబితా, హాల్ టికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టిసి, రేషన్‌కార్డు, స్పెషల్ కేటగిరీ అయితే అందుకు సంబంధించిన ధ్రువపత్రం, నివాస ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి రెండు సెట్లను అధికారులకు ఇవ్వాల్సి ఉంది. ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులు పీయూసీకి సంబంధించి మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.45 వేలు, ఇంజనీరింగ్‌కు సంబంధించి ఏడాదికి రూ.50 వేల చొప్పున 4 సంవత్సరాలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతోపాటు వసతి గృహ రుసుం కింద అదనంగా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. సూపర్ న్యూమరరీ కోటా కింద సీట్లు దక్కించుకున్న విద్యార్థులు ఏడాదికి ట్యూషన్ ఫీజు కింద రూ.1.50లక్షలతోపాటు అదనంగా వసతి గృహ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు

ఆ భూములను మసీదుకు స్వాధీనం చేస్తాం : పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట మండలంలోని కుమార కాల్వ గ్రామంలో ఉన్న ఖాద్రీయా మసీదుకు చెందిన భూములను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. కుమార కాల్వ గ్రామంలో ఉన్న ఖాద్రీయా మసీదుకు చెందిన భూములను ఆదివారం ఆర్‌డిఒ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కుమార కాల్వ రెవెన్యూ పంచాయతీ సర్వే నెంబరు 165లో దాదాపు 31ఎకరాలు ఒరిజినల్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రకారం మసీదు భూములుగా పేర్కొన్నారు. మసీదుకు చెందిన భూములను ఇతరులు ఎలాంటి డ్యాకుమెంట్ లేకుండా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు భూములు పరిశీలిస్తున్నామన్నారు. భూములు అక్కడక్కడ సాగులో ఉన్నాయన్నారు. 15 ఎకరాలు సాగులో ఉందన్నారు. ఇప్పటికే ఈ భూములపై చక్రాయపేట తహశీల్దార్ ప్రీమీలియర్ రిపోర్టును తయారు చేసినట్లు చెప్పారు. తాను కూడా భూములు పరిశీ లించడంతోపాటు రికార్డులు చేశామన్నారు. ఈ భూములు అన్ని ఒరిజనల్‌గా ఖాద్రీయా మసీదుకు చెందినవే అన్నారు. చివరి నివేదిక తయారు చేసి

ఆక్రమణకు గురైన మసీదు భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ చిన్నయ్య

కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆ భూములను మసీదుకు అప్పగి స్తామన్నారు. విలువైన భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఈ భూములకు సంబంధించి ఇతరులపై ఉన్న ఒన్-బి, ఆండగల్ కూడా రద్దు చేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన మసీదుకు భూములు చెందేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ చిన్నయ్య వివరించారు.

కొండెక్కిన కాంచరకాయలు

వర్షాభావంతో తగ్గిన దిగుబడి- కిలో రూ.200-విస్తుపోతున్న వినియోగదారులు

కాంచర కాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రుతుపవనాలు వచ్చి వర్షాలు పడడంతో ఇతర జిల్లాల నుండి కాంచర కాయలు పులివెందులకు వచ్చేశాయి. కాంచరకాయల ధరలు కొండెక్కాయి ఇప్పుడిప్పుడే అవి మార్కెట్‌లోకి వస్తుండడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చికెన్ ధరకు సమానంగా సరితూగుతున్నాయి. ప్రస్తుతం వీటిని కిలో రూ,200 చొప్పున విక్రయిస్తున్నారు. కాల్‌కిలో (250గ్రాములు) రూ.60 చొప్పున అమ్ముతున్నారు.కిలో తీసుకుంటే రూ.200కు ఇస్తున్నారు. వర్షభావం వల్ల ఈ ప్రాంతంలో కాంచరకాయలు లభించలేదు. ప్రస్తుతం వీటిని వ్యాపారస్తులు అనంతపురం జిల్లా తాడిపత్రి, గుత్తి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. రవాణా ఛార్జీలు విపరీతంగా పెరగడం వల్ల కాంచర కాయల ధరలు కూడా పెంచాల్సి వస్తోందని వ్యాపారులు మొహమాటం లేకుండా చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే కాయలు రావడం మొదలవుతుంది. ముఖ్యంగా వేరుశనగ పంటలో వీటి ఉత్పత్తి కనిపిస్తుంది. తొలకరి చినుకుల అనంతరం జూన్, జులై నెలలో వీటి ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. కాలక్రమైణా వివిధ కారణాల వల్ల ఖరీఫ్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగ పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో కాంచర కాయల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. కాంచర కాయలు కూడా ఆరోగ్యానికి మిక్కిలి ఉపయోగపడతాయి. వీటిలో కాస్త చేదు, వగరు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ వీటిని తినడానికి ఇష్టపడతారు. కాంచర కాయలను చూస్తే ప్రతి ఒక్కరికి నోరూరిస్తుంది. సీజన్ సమయంలో వీటిని కొనుగోలు చేసి బాగా ఎండబెట్టిన తర్వాత నిల్వ ఉంచుకొని తింటారు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజలకు రుచింపలేదు. అయితే ఇప్పుడిప్పుడే ఇవి మార్కెట్లోకి రావడం వల్ల వీటి ధరలు ఎక్కువగా ఉన్నా యని, కొన్నాళ్లు గడిస్తే తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. వర్షాభావ పరిస్థి తుల వల్ల కాంచర కాయల కొరత కనిపిస్తోంది. రుతుపవనాల ప్రభావం ఇతర ప్రాంతాల్లో ఉన్నా ఈ ప్రాంతంలో మాత్రం తక్కువగా ఉంది. ఈపాటికి పదును వర్షాలు వచ్చి ఉంటే కాంచర కాయలు కూడా విరివిగా లభ్యమ య్యేవి. రుతుపవనాల ప్రభావం కాంచర కాయలపై పడిందని చెప్పవచ్చు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భార్గవి

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కొండాపురం

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ భవనంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సి.సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, జ్యోతి, రాణి, మహేశ్వర్‌రెడ్డి, కొండాపురం సిఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ ప్రతాపరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పాటిమీదపల్లెకు చెందిన వైసిపి బిసి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన సుబ్బరాయుడు యాదవ్, ఆ పార్టీ బిసి సంఘం నాయకులు నేట్లపల్లి శివరాం ఆదివారం కలిశారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్సీ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన నియామకానికి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఎంతగానో కృషి చేశారని సుబ్బరాయుడు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా యాక్టివిటీ మెంబర్ ముత్తూరు చిన్న వెంకటసుబ్బయ్య, బత్తల నాగమల్లేష్ యాదవ్, చిట్టిబోయిన గోపాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

తేజ పాఠశాల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

రోడ్డుపై మురుగునీరు..అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గరుగువీధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రహదారిలో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. ఆ రహదారిలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారి ఉన్న డ్రెయినేజీ కాలువలు మట్టితో పూడిపోయాయి. అందులో మెయిన్ రోడ్డులోని డ్రెయినేజీ కాలువల్లోకి నీరు పోయేందుకు అవకాశం లేకపోవడంతో కాలువలోని నీరు రోడ్లపైకి వచ్చి నిలిచి పోతోంది. ఇళ్ల ముందర అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తేజ ప్రయివేట్ పాఠశాల ఉంది. ప్రతి నిత్యం ఆ రహదారిలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు వెళుతుంటారు. వారం రోజులుగా మురుగునీరు రోడ్డుపైనే నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయినట్లు ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. డ్రెయినేజీ కాలువల్లో మురుగునీరు ప్రవహించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీరు తాగి ఎద్దు మృతి

ప్రజాశక్తి - వేముల

కలుషిత నీరు తాగి గొందిపల్లె గ్రామానికి చెందిన రైతు డి.శేఖర్‌రెడ్డి ఎద్దు మృతి చెందింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలం దగ్గర ఎద్దు గెట్టున మేస్తూ.. డమ్ములో రసాయనాలతో కలిపిన నీటిని ఎద్దు తాగడంతో కొద్దిసేపటికి అది నేలపడిపోయింది. ఎద్దు విలువ రూ.80వేలు అని బాధిత రైతు వాపోయాడు. తాను వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని శేఖర్‌రెడ్డి వేడుకుంటున్నాడు.

క్రైం కార్నర్

భర్త వేధింపులు తాళలేక మహిళ మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో భర్త వేధింపులు తాళలేక మహిళ మృతి చెందింది. స్థానికుల మేరకు వివరాలిలా.. లింగాలదిన్నెపల్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి(33)కి 14 ఏళ్ల క్రితం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు సంతానం. కుటుంబ పోషణకు భర్త నరసింహారెడ్డి లారీలకు వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో భార్యపై నరసింహారెడ్డి అనుమానం పెంచుకున్నాడు. వేధించేవాడని సమాచారం. ఈ వేధింపులు భరించలేక శనివారం విష ద్రావణం తాగగా, స్థానికులు గమనించి పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన మహాలక్ష్మి